# కోశభక్తిగీతం

కోశమును ప్రేమించుమన్నా
కొంపలన్నీ ముంచుమన్నా
సిగ్గుశరములవంటివాటిని
దగ్గరకి రానీకుమన్నా

పరువు ఒక్కటి వదులుకుంటే
పదవులే నీవెంట పడునోయ్
వంగి దణ్ణము పెట్టగలిగే
భంగిమొక్కటి నేర్చుకోవోయ్

ముఖముపై ఉమ్మేసినా సరే
పదవి మాత్రం వదలకోయి
కన్నుమిన్నూ కాననప్పుడు
తన్నినా పడి ఉండవలెనోయ్

మంచి చెడులని ఎంచకుండా
ఒకే గాటన కట్టవోయి
మనకు లాభం ఎంత అన్నది
మటుకు మనమున మరువకోయి

మంచి సొమ్మును దోచుకుంటే
మజా పుట్టును తెలుసుకోవోయ్
ఎన్ని తరములకైనా తరగని
ఆస్తి సంపాదించవోయి

అన్నిబుక్కుల కన్న బ్యాంకుల
పాస్ బుక్కులే మిన్ననోయి
మాటపోతేపోనీ గానీ
మూటమాత్రం భద్రమోయి

వాసి సంగతి కాశికొదిలెయ్
నాసి సరుకులు నించవోయ్
ముందు వెనుకలు చూడకుండా
మందినే ఇబ్బంది పెట్టోయ్

పొరుగువాడికి కష్టమొస్తే
పురుగులాగా చూడవోయ్
తేనెపూసిన కత్తి నీవని
తెలియకుండా మసలుకోవోయ్

గాలి మాటలు చెప్పుగానీ
జాలి మాత్రం చూపకోయి
పిల్లికయినా బిచ్చమేసే
పిచ్చిపనులను చేయకోయి

పక్కవాడే పైకి వస్తే
తొక్కిపెట్టుట నేర్వనలెనోయ్
జుట్టు అందని వేళలందున
కాళ్ళు పట్టుట ముఖ్యమోయ్

నీతి అను చాదస్తమెందుకు?
కోతిపనులను చేయవోయి
కథలు చెప్పే విధము నేర్చుక
కాలక్షేపము చేయవలెనోయి
అసలు విషయం దాటవేసే
ముసుగు విద్యలు నేర్వ వలెనోయ్

– హాస్యబ్రహ్మ శ్రీ శంకరనారాయణ